




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

పేజీలు : 4 వెల రూ.4/-

సంపుటి : 7 సంచిక : 287

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

మంగళవారం 26 మార్చి 2024


## 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం

● 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచార భేరి




**గుంటూరు,కలంకౌంటర్ :** పేదింటి భవిష్యత్తును మరింత గొప్పగా మార్చేందుకు, మరోసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుని అధికారంలోకి రావడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 27న వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ నుంచి ప్రచార భేరి మోగించనున్నారు. మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద నివాళులు అర్పించి ఎన్నికల సంగ్రామానికి 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు దాదాపు 21 రోజులపాటు బస్సు యాత్ర కొనసాగనుంది. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి సిద్ధం సభలు నిర్వహించిన నాలుగు జిల్లాలు (విశాఖపట్నం, ఏలూరు, అనంతపురం, బాపట్ల) మినహా మిగతా జిల్లాల్లో బస్సు యాత్ర జరగనుంది. ప్రతి రోజూ ఒక పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బస్సు యాత్ర కొనసాగనుంది. ఈ యాత్రలో ఉదయం పూట వివిధ వర్గాలు, రంగాల ప్రజలతో సీఎం జగన్ సమావేశమవుతారు. ప్రభుత్వ పనితీరును మరింతగా మెరుగు పర్చుకోవడానికి సలహాలు, సూచనలు స్వీకరిస్తారు. కొందరు పార్టీ కార్యకర్తలను, అభిమానులను కూడా కలుస్తారు. సాయంత్రం పార్లమెంట్ నియోజకవర్గంలో బహిరంగ సభ ఉంటుంది. ఈనెల 27న ఇడుపులపాయలో కార్యక్రమం ప్రారంభించిన తర్వాత వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల మీదుగా సీఎం జగన్ ప్రొద్దుటూరుకు చేరుకోనున్నారు. ఎర్రగుంట్ల రోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద సీఎం జగన్ విడిది చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు శ్రీకన్యకా పరమేశ్వరి సర్కిల్, సినీ హబ్, ఆర్టీసీ బస్టాండ్, శివాలయం వీధి, రాజీవ్ సర్కిల్, కొర్రపాడు రోడ్డు మీదుగా బస్సు యాత్ర జరగనుంది. ఐదు గంటలకు పొట్టిపాడు రోడ్డు సమీపంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం వైఎస్ జగన్ ప్రసంగించనున్నారు. ఇందు కోసం సభ నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభకు కడప పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరుకానున్నారు.

**మార్చి 27 బస్సుయాత్ర షెడ్యూల్ :** బుధవారం ఉదయం 10:56 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుండి కడపకు సీఎం జగన్. 12:20కి ఇడుపులపాయ చేరుకోనున్న సీఎం జగన్. మధ్యాహ్నం 1 నుండి 1:20 వరకు వైఎస్ఆర్ ఘాట్ వద్ద ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్న జగన్. 1:30కి బస్సుయాత్ర ప్రారంభం. వేంపల్లి, వి.ఎన్.పల్లి, యర్రగుంట్ల మీదుగా ప్రొద్దుటూరు చేరుకోనున్న బస్సుయాత్ర. సాయంత్రం 4 గంటలకు ప్రొద్దుటూరులో బహిరంగ సభలో పాల్గొననున్న వైఎస్ జగన్అ. నంతరం దువ్వూరు, చాగలమర్రి మీదుగా ఆళ్లగడ్డ చేరుకోనున్న వైఎస్ జగన్. ఆ రాత్రి ఆళ్లగడ్డలోనే వైసీపి అధినేతబస చేయనున్నారు.

**ఫుల్ జోష్‌లో పార్టీ శ్రేణులు :** బస్సు యాత్ర ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు సీఎం జగన్ పూర్తిగా ప్రజలతో మమేకం కానున్నారు. యాత్రలోనే ఎక్కడికక్కడ విడిది చేయనున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశామని చెబుతూ ప్రతి ఇంటికీ మేలు చేశామని వివరించనున్నారు. గత 58 నెలల్లో డీబీటీ రూపంలో 2.70 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.1.79 లక్షల కోట్లు వెరసి రూ.4.49 లక్షల కోట్ల ప్రయోజనాన్ని 87 శాతం కుటుంబాలకు చేకూర్చారు. విద్య, వైద్య, వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో విప్లవాత్మక సంస్కరణల ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు%--%వలంటీర్ల వ్యవస్థ, జిల్లాల పునర్ వ్యవస్థీకరణ ద్వారా గుమ్మం వద్దకే ప్రజలకు ప్రభుత్వ సేవలను అందిస్తున్నారు. చేసిన మంచిని ప్రతి ఇంటా వివరించి.. ఆశీర్వాదం తీసుకోవడానికి చేపట్టిన 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గత 58 నెలల పాలనలో వచ్చిన విప్లవాత్మక మార్పులు ప్రతి నియోజకవర్గం, ప్రతి గ్రామం, ప్రతి ఇంటా కనిపిస్తున్నప్పుడు 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించడం సుసాధ్యమేనని సీఎం జగన్.. శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్లలో నిర్వహించిన సిద్ధం సభలకు సముద్రంతో పోటీ పడుతూ జనం హాజరయ్యారు. రాప్తాడు, మేదరమెట్ల సభలు రాష్ట్ర చరిత్రలో అతి పెద్ద ప్రజా సభలుగా నిలిచాయి. ఎన్నికలకు ముందే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం 'సిద్ధం' సభల్లో కళ్లకు కట్టినట్లు కన్పించడంతో పార్టీ శ్రేణులు కదనోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.

**క్లీన్ స్వీప్ లక్ష్యంగా అడుగులు :** టీడీపీ%--%జనసేన%--%బీజేపీ శ్రేణులు నైతిక స్థైర్యం కోల్పోయి కకావికలమైతే వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో జోష్ కనిపిస్తోంది. ఈ దశలో సీఎం జగన్ బస్సు యాత్ర వారిలో మరింత ఉత్సాహాన్ని



హోలీ పండగ సందర్భంగా మనవడితో కలిసి సరదాగా హోలీ సంబరాల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

తెలంగాణ, కలంకౌంటర్ :

## ముస్లింల భద్రతకు నాదీ బాధ్యత

● నేనున్నంతకాలం ముస్లింలకు అన్యాయం జరగదు ● రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా కేంద్ర సాయం అవసరం ● ఎన్నడూ లేని విధంగా జగన్ హయాంలో ముస్లింలపై దాడులు● ముస్లింలకు పథకాలు రద్దు చేశాడు...ఆర్థిక సాయం నిలిపేశాడు● ముస్లింల హక్కులకు భంగం కలిగే చర్యలు మేము ఏనాడూ తీసుకోలేదు● -టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు





**కుప్పం,కలంకౌంటర్ :** "రంజాన్ మాసం అంతా సూర్యాస్తమయం వరకూ నీళ్లు, ఆహారం తీసుకోకుండా కఠోరమైన దీక్షను ముస్లిం సోదరులు చేపడతారు. ముస్లింలకు న్యాయం చేసిన ఏకైక పార్టీ టీడీపీ. 40 ఏళ్లుగా ముస్లింలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. ఉర్దూను రెండో భాషగా చేసింది టీడీపీనే. సమైక్యరాష్ట్రంలో 13 జిల్లాల్లో ఉర్దూను రెండో భాషగా చేశాను. ముస్లింలో చాలా మంది పేదలు ఉన్నారని గుర్తించిన ఎన్టీఆర్ 1985లో దేశంలోనే మొదటిసారిగా కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించారు. హజ్ యాత్రకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ లో హజ్ హౌస్ కట్టి విమాన సదుపాయాన్ని కల్పించాం. రాష్ట్రం విడిపోయాక కడప, విజయవాడలో హజ్ హౌస్ ల నిర్మాణం చేపట్టి 90 శాతం పూర్తి చేశాం. కానీ వాటిని ఈ ప్రభుత్వం పూర్తి చేయలేదు. సమైక్య రాష్ట్రంలో ఉర్దూ యూనివర్సిటీని హైదరాబాద్ కు తెచ్చాం...విభజన తర్వాత కర్నూలుకూ తెచ్చాం. ఖురాన్ స్ఫూర్తితో పేద ముస్లింలైన 10 లక్షల మందికి రంజాన్ తోఫా ఇచ్చాం. దుకాన్ మకాన్, దుల్హన్ పథకాలను ప్రవేశపెట్టాం. 33 వేల మందికి దుల్హన్ పథకం ద్వారా రూ.165 కోట్లు ఆర్థిక సాయం ఇచ్చిన ఏకైక పార్టీ టీడీపీ. విదేశీ విద్య కింద 527 మందిని విద్యార్థులను విదేశాలకు పంపించాం. కానీ ఈ ప్రభుత్వం ఎవరికీ డబ్బులు ఇవ్వలేదు. ఒక్క మైనారిటీ సోదరుడికైనా ఆర్థిక సాయం అందించిందా..? ఒక్క మసీదైనా కట్టారా.? ఆఖరికి మ-రమ్మతులకు కూడా డబ్బులు ఇవ్వలేదు. నాడు నేను రూ.3 లక్షల రుణం ఇచ్చి రూ.లక్ష సబ్సిడీ ఇచ్చా. ఇమామ్, మౌజన్ లకు గౌరవ వేతనం ఇచ్చింది టీడీపీనే. కానీ 6 నెలలుగా ఈ ప్రభుత్వం గౌరవ వేతనం ఇవ్వడం లేదు. నంద్యాలలో అబ్దుల్ సలాం కుటుంబాన్ని వేధించడంతో ఆత్మహత్య చేసుకుంది. ఎమ్మిగనూరులో హాజీరాబీ అనే ముస్లిం యువతిని కొందరు వైసీపీ గూండాలు అత్యాచారం చేసి చంపేస్తే పట్టించుకోలేదు. వి.కోటలో చదువుల తల్ల మిస్బా బాగా చదువుతుంది...కానీ వైసీపీ నేత కూతురు సెకెండ్ వస్తోందని మిస్బాకు టీసీ ఇవ్వడంతో ప్రాణాలు వదిలిపెట్టింది. మస్లిం ఆడబిడ్డ బాగా చదువుకుంటే మనసు ఒప్పలేని దుర్మార్గులు వీళ్లు. కళ్యాణదుర్గంలో చాపిరి గ్రామంలో యువతిని మోసం చేసి చంపి నందిలో పడేశారు. దాచేపల్లిలో అలీషా మద్యం అమ్ముతున్నాడని నింద వేసి కొట్టి చంపేశారు. కడపలో అక్బర్ బాషాకు చెందిన భూమిని కబ్జా చేయడంతో ఆత్మహత్యకు యత్నించాడు. ముస్లిం యువకులపై పుంగనూరులో కేసులు పెట్టి 12 మందిని జైలుకు పంపారు. మసీదును కబ్జా చేస్తున్నారని పోరాడినందుకు నరసరావుపేటలో ఇబ్రహీంను నరికి చంపారు. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా.? 45 ఏళ్ల ట్రాక్ రికార్డు ఉన్న పార్టీ టీడీపీ. ఎన్డీయేలో ఉన్నప్పుడు కూడా గతంలో మీ హక్కులకు భంగం కలిగే చర్యలు ఏనాడూ చేయలేదు. మీ పిల్లల అభివృద్ధి కోసం కృషి చేశాం. పార్లమెంట్ లో అన్ని చట్టాలకు వైసీపీ ముందుండి మద్దతు ఇచ్చింది. రాష్ట్రంలో రాక్షస ప్రభుత్వం ఉంది..అందరిపై దాడులు చేస్తున్నారు..అందుకే నేను, పవన్ ఆలోచించి బీజేపీ ముందుకు రావడంతో పొత్తు పెట్టుకున్నాం. ముస్లింలకూ పనులు కావాలన్నా...అభివృద్ధి చెందాలన్నా కేంద్ర ప్రభుత్వ సాయం కావాలి...అందుకే పొత్తు పెట్టుకున్నాం తప్ప మరో కారణం కాదు. 3 పార్టీలు రాష్ట్ర భవిష్యత్తు కోసమే పొత్తు పెట్టుకున్నాయి. నేను సీఎంగా ఉన్నంత కాలం మీకు అన్యాయం జరగదు. దుర్మార్గ ప్రభుత్వం వస్తే మీకూ భవిష్యత్తు ఉండదు. ముస్లింలు, క్రిస్టియన్లు కూడా ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుంది. అందరినీ సమానంగా చూసి, అందరికీ సంక్షేమాన్ని అందించే ఏకైక పార్టీ టీడీపీ. ప్రతి ఒక్కరికీ న్యాయం జరగాలన్నదే నా తపన. ముస్లింలకు ఏం కావాలన్నా నేను ముందుంటా. ముస్లిం సోదరులు ఏదీ మనసులో పెట్టుకోకుండా ముందుకు రావాలి. ముస్లింల భద్రతకు నాది బాధ్యత అన్నారు.

## మాజీ మంత్రి ఎర్రబెల్లిపై సీఎం రేవంత్‌కు ఫిర్యాదు

**హైదరాబాద్, కలంకౌంటర్ :** బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుపై హైదరాబాద్‌కు చెందిన వ్యాపారి శరణ్ చౌదరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దయాకర్ రావు తనను అక్రమంగా నిర్బంధించి తన సమీప బంధువు విజయ్ పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రెండు రోజులపాటు తనను అక్రమంగా నిర్బంధించడమే కాకుండా... రూ.50 లక్షలు ఇవ్వాలంటూ తన కుటుంబ సభ్యులను బెదిరించారని ఆరోపించారు. దీంతో తన స్నేహితుడు రూ.50 లక్షలు వీరికి అందజేశారని, అనంతరం తనను వదిలిపెట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై హైకోర్టులో రిట్ పిటిషన్ వేశానని, అయితే ఏసీపీ ఉమా మహేశ్వర్ రావు తన వద్దకు పోలీసులను పంపి బెదిరించడంతో ఆ పిటిషన్‌ను ఉపసంహరించుకున్నానని వివరించారు. ఆగస్ట్ 21, 2023న తాను ఆఫీస్‌కు వెళ్తుండగా సివిల్ దుస్తుల్లో కొందరు వ్యక్తులు తనను అడ్డగించి తాము పోలీసులమని చెప్పి సీసీఎస్‌కు తీసుకెళ్లారని వివరించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర రావు, డీసీపీ రాధా కిషన్ రావు సూచనల మేరకు తనను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించి కొట్టారని ఫిర్యాదులో ఆయన వివరించారు. పలువురి నుంచి అక్రమంగా నగదు డిపాజిట్లు సేకరించినట్లు తనపై ఏసీపీ ఉమా మహేశ్వరరావు కేసు నమోదు చేస్తానంటూ బెదిరించారని ఈ సందర్భంగా వివరించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని సీఎం రేవంత్ రెడ్డిని వ్యాపారి శరణ్ చౌదరి కోరారు.

## ఏపీలో పెరుగుతున్న పొలిటికల్ హీట్.. ఒకేసారి చంద్రబాబు, జగన్ ప్రచారం ప్రారంభం

● మార్చి 27న రాయలసీమలోని సొంత నియోజకవర్గాల నుంచి జగన్, చంద్రబాబు ప్రచారం ప్రారంభం ● మేమంతా సిద్ధం పేరుతో ఉత్తరాంధ్ర వరకూ జగన్ బస్సు యాత్ర ● నియోజకవర్గాల వారీగా చంద్రబాబు ప్రచారం ● రోజుకు 3 నుంచి 4 నియోజకవర్గాల్లో చంద్రబాబు సభలు, సమావేశాలు....



**విజయవాడ, కలంకౌంటర్ :** ఏపీలో పొలిటికల్ హీట్ రానురాను పెరుగుతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో ఏపీ సీఎం జగన్, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఒకే రోజు తమ ప్రచార కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. మార్చి 27న ఇందుకు ముహూర్తం ఫిక్స్ అయ్యింది. ఇద్దరు నేతలూ రాయలసీమలోని తమ సొంత నియోజకవర్గాల నుంచి ప్రచారం ప్రారంభించనున్నారు. ఎన్నికలకు సిద్ధమవుతున్న ప్రభుత్వ ప్రతిపక్ష పార్టీలు ఇప్పటికే అభ్యర్థుల ఎంపికను దాదాపుగా పూర్తి చేశాయి. దీంతో, ప్రధాన పార్టీల ఫోకస్ ప్రచారం వైపు మళ్లింది. ఎల్లుండి నుంచి సీఎం జగన్, చంద్రబాబు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నారు. ఇద్దరు ప్రధాన నేతలు ఒకేసారి ప్రచారం మొదలుపెట్టనుండటం రాష్ట్రంలో రాజకీయ వేడిని పెంచేసింది.

**జగన్ షెడ్యూల్ ఇదీ..** ఇప్పటికే సిద్ధం యాత్ర పేరిట ప్రజల్లో ఉన్న సీఎం జగన్ ఎల్లుండి నుంచి మేమంతా సిద్ధం పేరిట ప్రచారం నిర్వహిస్తారు. కడప జిల్లా ఇడుపుల పాయలో ప్రారంభమయ్యే జగన్ యాత్ర ఉత్తరాంధ్ర వరకూ కొనసాగుతుంది. 27న ఇడుపులపాయలోని వైఎస్ఆర్ ఘాట్ వద్ద జగన్ నివాళులు అర్పించి ప్రచారం ప్రారంభిస్తారు. ఆ రోజు సాయంత్రం ప్రొద్దుటూరులో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు. 28వ తేదీన నంద్యాల లేదా ఆళ్లగడ్డలో ప్రజలతో ముఖాముఖీ నిర్వహిస్తారు. అదే రోజు సాయంత్రం నంద్యాలలో జరిగే బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. 29న యాత్ర కర్నూల్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రవేశిస్తుంది. ఆ రోజు సాయంత్రం ఎమ్మిగనూరులో నిర్వహించే బహిరంగ సభలో సీఎం జగన్ పాల్గొంటారు.

**చంద్రబాబు ప్రచారం ఇలా..** మార్చి 27 నుంచి మార్చి 31 వరకూ చంద్రబాబు ప్రచారం కొనసాగనుంది. రోజుకు 3 నుంచి 4 నియోజకవర్గాల్లో సభలు సమావేశాలు నిర్వహించేలా ప్రచారం షెడ్యూల్ సిద్ధమైంది. 27న పలమనేరు, నగరి, నెల్లూరు రూరల్ నియోజకవర్గాల్లో బాబు ప్రచారం నిర్వహిస్తారు. 29న రాప్తాడు, శింగనమల, కదిరి.. 29న శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలు.. 30న మైదుకూరు, ప్రొద్దుటూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తిలో టీడీపీ అధినేత ప్రచారం నిర్వహిస్తారు. 31వ తేదీన కావలి, మార్కాపురం, సంతనూతలపాడు, ఒంగోలులో చంద్రబాబు పర్యటిస్తారు. నేడు రేపు మాత్రం సొంత నియోజకవర్గంలో చంద్రబాబు ప్రచారం నిర్వహిస్తారు.



కుప్పంలోని కే వీ ఆర్ మండపంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్న చంద్రబాబు

కుప్పం,కలంకౌంటర్ :

# రజక యువత ఆధ్వర్యంలో రస్నా పంపిణీ..



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవి మండల పరిధిలోని పెద్దప్రోలు అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర మహోత్సవం సందర్భంగా రజక యువత ఆధ్వర్యంలో రజకుల కులదైవం అంకమ్మ తల్లి గుడి వద్ద సుమారు 3000 మంది భక్తులకు రసనా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చల్లపల్లి సి.ఐ సిహెచ్ నాగప్రసాద్, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ పాల్గొని భక్తులకు చల్లటి రసనా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కల్లేపల్లి శ్రీనివాస్, కల్లేపల్లి పూర్ణ, కొండపల్లి శివ, కల్లేపల్లి సాయి, కల్లేపల్లి ఫణి,జగదీష్, రవి పాల్గొన్నారు.

# మర్యాదపూర్వక కలయిక





**జంగారెడ్డిగూడెం,కలంకౌంటర్ :** తాడేపల్లిగూడెం వీరంపాలెం వాస్తవ్యులు బ్రహ్మశ్రీ గరిమెళ్ల వెంకటరామ సిద్ధాంతి జంగారెడ్డిగూడెం విచ్చేసిన సందర్భంగా వారిని కుటుంబ సమేతంగా కలిసి వారి ఆశీస్సులు పొందిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు చిన్ని రామసత్యనారాయణ.

# ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి - కూటమి పార్టీల అభ్యర్థి వెనిగండ్ల రాము



**గుడివాడ,కలంకౌంటర్ :** శ్రీ అయ్యప్ప స్వామి వారి జన్మ నక్షత్ర వేడుకల్లో పాల్గొన్న వెనిగండ్ల రాము బంటుమిల్లి రోడ్డులోని శ్రీ స్వామి అయ్యప్ప స్వామి వారి దేవస్థానంలో అత్యంత వైభవంగా జరిగిన స్వామివారి జన్మ నక్షత్ర పర్వదిన వేడుకలు. వేడుకల్లో పాల్గొని, భక్తులతో కలిసి స్వామివారికి భక్తిశ్రద్ధలతో కనకాభిషేక పూజలు నిర్వహించిన వెనిగండ్ల రాము. వేడుకల్లో భాగంగా కృష్ణన్ తాంత్రి పర్యవేక్షణలో నిర్వహించిన హోమ, అభిషేక పూజలో పాల్గొన్న రాము. పూజా కార్యక్రమాలు అనంతరం స్వామివారి ప్రసాదం అందజేసి, దేవస్థానం సంప్రదాయం ప్రకారం రాముకు గౌరవ సత్కారం చేసిన కమిటీ సభ్యులు.

# టిడిపికి స్వామివారి ఆశీస్సులు కావాలి : దామచర్ల సత్య



**మర్రిపూడి,కలంకౌంటర్ :** 2024 మేలో జరిగే సార్వత్రిక ఎన్నికలకు లక్ష్మీనరసింహస్వామి వారి ఆశీస్సులు తెలుగుదేశం పార్టీకి కావాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. మండల కేంద్రంలోని ప్రుదులగిరి లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాల సందర్భంగా సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో సత్యా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండపి నియోజకవర్గ ప్రజలకు మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా రైతులు, కార్మిక కర్షకులు, చేతి వృత్తుల వారికి మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించి వారి జీవనోపాధికి దేవుని ఆశీస్సులు ఉండాలని కోరారు. మరో 50 రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే స్వామిని మూడోసారి గెలిపించి అసెంబ్లీకి పంపాలని నియోజకవర్గ ప్రజలను కోరారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా స్వామిని, ఎంపీగా మాగుంట రాఘవరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నరసారెడ్డి, రేగుల వీర నారాయణ, తోపాటు పలు గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులతో కిటకిటలాడిన పెదప్రోలు శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారు..





**మోపిదేవి,కలంకౌంటర్ :** కృష్ణాజిల్లా,మోపిదేవి.మండలం పెద్దప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకోవడానికి, అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం కమిటీ వారు కూరపాటి కోటేశ్వరరావు దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షించారు. చల్లపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ నాగప్రసాద్, మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీస్ భద్రత ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని చల్లపల్లి సిఐ నాగప్రసాద్ మరియు మోపిదేవి ఎస్ఐ సత్యనారాయణ దగ్గరుండి భక్తులకు అన్నదానం వడ్డించారు. గ్రామపంచాయతీ సిబ్బంది శానిటేషన్,, వీధిలైట్లు ఏర్పాట్లు చేశారు. పెదప్రోలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. శిరీష, ఏ.ఎన్.ఎం,ఆశ వర్కర్లు ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. స్థానిక శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అద్దంకి నాంచారమ్మ తల్లి జాతర సందర్భంగా దేవస్థానం వారు చక్కటి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అన్నమాచార్య కీర్తనలు, కూచిపూడి నాట్యం, సత్య హరిచంద్ర నాటకం, హైదరాబాద్ వారిచే సినీ మ్యూజికల్ నైట్ ప్రముఖ సినీ గాయని చే చక్కటి ఆర్కెస్ట్రా , తీన్మార్ డబ్బులు, ఏలూరు వాస్తవ్యులు ఇచ్చే మురళి కోలాటం, మ్యాజిక్ షో మొదలగు కార్యక్రమాలు దేవస్థానం కమిటి ఏర్పాటు చేసింది. సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు స్వచ్ఛంద సంస్థలు మజ్జిగ ఏర్పాటు చేశారు.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరుని సన్నిధిలో బొబ్బా గోవర్ధన్



**మోపిదేవి,కలంకౌంటర్ :** మోపిదేవిలో భక్తుల చేత విశేష పూజలు అందుకుంటున్న శ్రీ వల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని ప్రముఖ పారిశ్రామికవేత్త బొబ్బా గోవర్ధన్ దర్శించుకున్నారు. దేవస్థానానికి కుటుంబ సమేతంగా వచ్చిన గోవర్ధన్ ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శ్రీ స్వామి వారిని దర్శించుకుని, పూజలు నిర్వహించారు. జనసేన పార్టీ తరపున అవనిగడ్డ సీటు ఆశిస్తున్న గోవర్ధన్ మోపిదేవి ప్రధాన సెంటర్లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పొత్తులో భాగంగా జనసేన పార్టీ తరఫున అవనిగడ్డ సీటు కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. మోపిదేవి, చల్లపల్లి, అవనిగడ్డ పరిసర ప్రాంతాలలో తన విద్యాభ్యాసం కొనసాగగా ఉన్నత చదువుల నిమిత్తం బయటకు వెళ్లి స్థిరపడినట్లు చెప్పారు. దివిసీమలో పలు కార్యక్రమాలు చేశామన్నారు. జనసేన సీటు తనకు కేటాయిస్తారనే నమ్మకం ఉన్నదని ఆశాభావం వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు గ్రామాలలో పనిచేశారన్నారు. పుట్టి, పెరిగింది అవనిగడ్డ నియోజకవర్గంలోనే కాబట్టి సమస్యలన్నీ తనకు తెలుసునని, తనకు అవకాశం ఇస్తే తద్వారా ప్రజలందరినీ ముందుకు తీసుకెళతానని తెలిపారు. ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినా ఎన్నడూ మీడియా ముందుకు తీసుకెళ్లలేదన్నారు. కనీస అవగాహన లేకుండా ఎడ్లంక నుంచి ఇష్టానుసారం ఇసుక తవ్వేస్తున్నారన్నారు. దీనివలన ఎడ్లలంక గ్రామం ముప్పునకు గురవుతుందన్నారు. అక్రమాలకు ఫుల్ స్టాప్ పెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళతానని, అంతేకానీ ఎవరిని విమర్శించనున్నారు. విమర్శలకు తావు లేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి తన వద్ద ప్రణాళికలు ఉన్నాయని గోవర్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దోవా గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా ట్రోలింగ్స్ సమాజానికి చాలా ప్రమాదకరం..ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్..

**తెనాలి,కలంకౌంటర్ :** ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ట్రోలింగ్స్ హుందా తనంగా ఉండకుండా వ్యక్తిగత విమర్శలకు దిగి చాలా ప్రమాదకర స్థాయికి వెళ్ళాయని ప్రముఖ సినీ రచయిత కోన వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల తెనాలి పట్టణంలో సోషల్ మీడియా ట్రోలింగ్స్ వల్ల ఆత్మహత్య చేసుకున్న గీతాంజలి కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించి వారికి 50 వేలు ఆర్థిక సహాయం చేశారు. అనంతరం గీతాంజలి భర్త బాలచందర్ కుమార్తెలు రిషిత రుషిక లను హత్తుకుని తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని ఆడపిల్లలకు తల్లి లేని లోటు ఎవ్వరూ పూడ్చలేనిదన్నారు. ఈ వయసులో వారికి తెలియకపోవచ్చు కానీ 10 సంవత్సరాలు దాటిన దగ్గర నుంచి ఆ తల్లి లేని బాధ వారికి అర్థమవుతుందని ఆ చిన్నారులని ఇద్దరిని తన ఒళ్ళు కూర్చోబెట్టుకుని కోన వెంకట్ కళ్ల వెంట కన్నీరు కార్చారు. ఇది చాలా దారుణమైన విషయం నేను కూడా ఇటీవల ప్రభుత్వ పాఠశాలలు బాగుపడ్డాయని ఒక మారుమూల ప్రాంతానికి వెళ్లి ఒక ఫోటోను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే నన్ను కూడా విపరీతంగా ట్రోల్ చేశారని అయినా నేను వాటిని పట్టించుకోలేదు అన్నారు. కానీ సున్నిత మనస్కులు ఈ ట్రోలింగ్స్ తట్టుకోలేక ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని దయచేసి ఎవరిని వ్యక్తిగతంగా ట్రోలింగ్ చేయకూడదని ఇది ఎవ్వరు చేసిన తప్పేనని ఆయన తెలిపారు. ప్రభుత్వం కూడా ఇలాంటి వాటి పట్ల



కఠినంగా వ్యవహరించి ప్రత్యేక చట్టాలు తయారు చేయాలన్నారు. ఇప్పటినుంచి నాకు నలుగురు కూతుర్లని గీతాంజలి కుమార్తెలను కూడా నా సొంత కుమార్తెల్లాగా పెంచుతాననీ వారికే అవసరం వచ్చిన నేనే ముందు ఉంటానని కోన వెంకట్ హామీ ఇచ్చారు.

# అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలు పరిష్కారం కోసం అధికారులు పూనుకోవాలి

● సిఐటియు బాపట్లజిల్లా అధ్యక్షులు సిహెచ్.మణిలాల్



**చెరుకుపల్లి,కలంకౌంటర్ :** గుళ్లపల్లి నూకాలమ్మ గుడి కళ్యాణ మండపంలో జరిగిన చెరుకుపల్లి మండలం అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పార్స్ యూనియన్ సమావేశంలో పాల్గొన్న సిఐటియూ బాపట్ల జిల్లా అధ్యక్షులు సిహెచ్. మణిలాల్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కే.ఝాన్సీలు మాట్లాడుతూ రోజువారి అంగన్వాడీలకు వచ్చే సమస్యలు పరిష్కారంకోసం ఐసిడిఎస్ అధికారులు పూనుకోవాలని అన్నారు. సాంకేతిక కారణాలు ఫోన్స్ పనిచేయని నేపథ్యంలో అంగన్వాడీలు ప్రతిరోజు చేస్తునా పనిని అనేక యాప్స్ లో నమోదుచేయాలని ఎఫ్ఆర్ఎస్ యాప్ లో నమోదు చేయాల్సిందే అంటు ఒత్తిడి చేయడంవల్ల అనేక మంది వర్కర్లు తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. కావున వెంటనే ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని ఆ విధంగా సంబంధిత ఐసిడిఎస్ అధికారులు ఆర్డర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమ్మెకాలం 42 రోజుల వేతనం వెంటనే వర్కర్ల అకౌంట్లో జమ చేయాలని అన్నారు,వేసవికాలం నేపథ్యంలో అంగన్వాడీ కేంద్రాలను ఒక పూట నడిపేలాగా సర్కిల్ ఇవ్వాలని, వేసవిలో సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పలపట్ల ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు వై. మేరీమణి, చెరుకుపల్లి మండలం అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీనియర్ నాయకులు ఎస్.అరుణ,జి.విజయలక్ష్మి మల్లేశ్వరి,శిరీష, మంగాదేవి,సంతోష కుమారి,చైతన్య తదితరులు పాల్గొన్నారు

# 'మేమంతా సిద్ధం' పేరుతో బస్సు యాత్రకు శ్రీకారం

(మొదటిపేజీ తరువాయి)

నింపనుంది. క్లీన్ స్వీప్ లక్ష్యంగా ముఖ్యమంత్రి అడుగులు ముందుకు వేస్తున్నారు. వైఎస్సార్సీపీ శ్రేణులను 'మేం సిద్ధం..మా బూత్ సిద్ధం.. ఎన్నికల సమరానికి మేమంతా సిద్ధం' పేరుతో గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టంగా ఎన్నికలకు సన్నద్ధం చేసేలా సీఎం జగన్ దిశా నిర్దేశం చేస్తారు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానున్న నేపథ్యంలో, ఆలోగా తొలి దశ ప్రచారంగా బస్సు యాత్ర పూర్తి చేయాలని నిర్ణయించారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడ్డాక మలి విడత ప్రచారాన్ని చేపట్టనున్నారు.

# జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి..

● సహజ సిద్ధ రంగులతో పండుగ జరుపుకోండి... ● జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు ● కలెక్టర్ ఎస్. డిల్లీరావు



**విజయవాడ,కలంకౌంటర్ :** రాధ, కృష్ణుల ప్రేమకు ప్రతిరూపంగా జరుపుకునే అతి ముఖ్యమైన హోలీ పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్. డిల్లీరావు ఆకాంక్షించారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ విశిష్టతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని సంప్రదాయ బద్ధంగా రసాయన రహిత రంగులతో జరుపుకోవాలన్నారు. ప్రతి ఒక్కరి జీవితం ఇంద్రధనస్సులో ఉండే సప్తవర్ణ శోభితం కావాలన్నారు. పురాణాలలో హోలీ పండుగకు ఒక ప్రత్యేకత ఉందన్నారు. ఒక కోణంలో చూస్తే హిరణ్యకశిపునిపై విష్ణువు సాధించిన విజయాన్ని కూడా సూచిస్తుందని, చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా హోలీ పండుగ ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారనీ ప్రతి ఒక్కరి జీవితంలో సుఖ సంతోషాలు వెల్లి విరియాలనీ కోరుతూ జిల్లా కలెక్టరు ఢిల్లీ రావు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలియ జేశారు.

# కందుకూరు గాయత్రీ నగర్ లో దారుణ హత్య



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని గాయత్రీ నగర్ నందు బ్యూటీ పార్లర్ నిర్వహిస్తున్న వనజాక్షి ని సోమవారం దారుణంగా హత్య చేశారు. విషయం తెలుసుకున్న కందుకూరు సిఐ నఫీస్ సంఘటన స్థలానికి విచ్చేసి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. ఎవరు హత్య చేశారన్నది ఇంకా తెలియలేదు. మృతురాలు భర్త పై అనుమానం ఉందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. కేసు వివరాలు తెలియాల్సి ఉంది.

# శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో యువనేత లోకేష్



**మంగళగిరి, కలంకౌంటర్ :** రాష్ట్రవ్యాప్తంగా పేరుగాంచిన మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి శ్రీవారి దివ్య రథోత్సవం వైభవంగా సాగింది. యువనేత నారా లోకేష్ సోమవారం మధ్యాహ్నం శ్రీవారి రథోత్సవంలో ఉత్సాహంగా పాల్గొని రథాన్ని లాగారు. శ్రీమాన్ మాడభూషి వేదాంతాచార్యులు నేతృత్వాన సాగిన ఈ ఉత్సవంలో నమో లక్ష్మీ నారసింహ నామస్మరణతో మంగళగిరి వీధులు హోరెత్తాయి. భక్తుల జయజయ ధ్వానాలు, మంగళ వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా సాగిన స్వామివారి రథోత్సవంలో భక్తి పారవశ్యం పొంగిపొర్లింది. వివిధ రకాల పుష్పాలు, మామిడి, అరటి తోరణాలతో దివ్యరథాన్ని శోభాయమానంగా అలంకరించారు. స్వస్తి శ్రీ చాంద్రమానేన శోభకృత్ నామ సంవత్సర ఫాల్గుణ శుద్ధపౌర్ణమి సందర్భంగా కన్నుల పండువగా సాగిన ఈ రథోత్సవంలో రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఉత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసిన మంగళగిరి పద్మశాలీయ శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథచక్రాల బృందం కమిటీ సభ్యులను యువనేత లోకేష్ అభినందించారు.

**అన్నయ్యలా అండగా ఉంటా..చదివిస్తా : వైసీపీ ల్యాండ్ మాఫియాకి బలైన సుబ్బారావు కుమార్తె నిత్యకి నారా లోకేష్ హామీ..** వైసీపీ ల్యాండ్ మాఫియా అకృత్యాలకు చేనేతవర్గానికి చెందిన సుబ్బారావు కుటుంబం బలైపోయింది. వారి అమ్మాయి నిత్య అనాథగా మిగిలింది. టిడిపి అధినేత చంద్రబాబు ఆ అమ్మాయికి అండగా నిలుస్తామని ఇదివరకే ప్రకటించారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర నేతృత్వంలో బృందం సోమవారం రాజంపేట నియోజకవర్గం, ఒంటిమిట్ట మండలం, కొత్త మాధవరం గ్రామానికి చేరుకుని నిత్యని పరామర్శించారు. ఈ సందర్భంగా నిత్యని ఫోన్‌లో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పరామర్శించారు.

# హెూలీ సంబరాలు





**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో హెూలీ సంబరాలు అంబరాన్ని అంటేలా గొడుగుపేట లో ఆర్ ఎస్ వేముల శిరీష నివాసంలో నిర్వహించారు.

# పకడ్బందీగా ఓటరు సహాయక కేంద్రాల ఏర్పాటు

● పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి ● జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్





**కందుకూరు,కలంకౌంటర్ :** భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఎక్కువ పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో ఓటరు సహాయక కేంద్రాలను పకడ్బందీగా ఏర్పాటు చేయాలని, ఈ విషయమై సెక్టోరల్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టి నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ పేర్కొన్నారు. సోమవారం ఉలవపాడు మండలం కరేడు గ్రామంలోని పాతాళం వెంకటసుబ్బయ్య శ్రేష్టి జడ్పీ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విద్యాధరితో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లందరూ ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పక్కాగా అన్ని ఏర్పాట్లను ముందస్తుగానే చేపడుతున్నట్లు చెప్పారు. ఎక్కువ ఓటర్లు గల పోలింగ్ కేంద్రాలు ఉన్న ప్రదేశంలో ఓటరు సహాయక కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సహాయక కేంద్రం ద్వారా ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకుని, ఆ పోలింగ్ కేంద్రానికి సులువుగా వెళ్లి ఓటు వేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. దీంతో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కలుగుతుందన్నారు. అలాగే పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులపై దృష్టిసారించామని, వేసవికాలం దృష్ట్యా ఎండ, వడగాలుల నుంచి ఓటర్లకు ఇబ్బందులు లేకుండా టెంట్లు ఏర్పాటు చేయడం, తాగునీరు అందుబాటులో ఉంచడం వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు చెప్పారు. ప్రతి కేంద్రంలో వికలాంగుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ర్యాంపుల ఏర్పాటు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లపై సెక్టోరల్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని, అని ఏర్పాట్లు ముందుగానే సమకూర్చుకోవాలని సూచించారు.

### పోలీసు చెక్ పోస్ట్ తనిఖీ

ఉలవపాడు సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన పోలీసు చెక్పోస్ట్ ను కలెక్టర్ పరిశీలించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా నగదు, మద్యం, ఇతర సామగ్రి తరలించే వాహనాలపై నిఘా ఉంచి సీజ్ చేయాలని సూచించారు.

### కంట్రోల్ రూమ్ ను పరిశీలించిన కలెక్టర్

2024 సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కందుకూరు రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్ ను కలెక్టర్ పరిశీలించారు. సి విజిల్, 1950 కాల్ సెంటర్లకు వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీసి, వెంటనే పరిష్కరించాలని సూచించారు. సింగిల్ విండో పర్మిషన్ సెల్ ను సందర్శించి పలు అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అకౌంటింగ్ కి, వీడియో వ్యూవింగ్ టీం పనితీరును పరిశీలించి, అన్ని రికార్డులను పక్కాగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట కందుకూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి విద్యాధరి, తాసిల్దార్ ప్రేమ్ చంద్రారెడ్డి, సెక్టోరల్ అధికారి పివి రమణయ్య, బి ఎల్ వో లు ఉన్నారు.

# సేవా కార్యక్రమం లో మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా ప్రసాద్



**మచిలీపట్నం కల్చరల్,కలంకౌంటర్ :** హెల్పింగ్ స్పాట్ సంస్థ నిర్వహించిన పాత బట్టల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్న మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్ ఈ కార్యక్రమంలో హెల్పింగ్ స్పాట్ సంస్థ ఫౌండర్ భార్గవ్, డైరెక్టర్ ఉమా భార్గవ్, సుకన్య, నజీర్, చరణ్, చందు, మానస, మాధురి, హృదయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటింటికి ఇంటూరి సౌజన్య

● కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గ తెలుగుదేశం బిజెపి జనసేన కూటమి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు సతీమణి ఇంటూరు సౌజన్య సోమవారం విక్కిరాలపేట రోడ్డులో గల ఆరో వార్డు నందు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కూటమి అధికారంలోకి వస్తే మహిళల భవిష్యత్తు బాగుపడుతుందని ఆమె తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థి తన భర్త ఇంటూరి నాగేశ్వరరావుని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను ఆమె కోరారు. చంద్రబాబు నాయుడు తోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని యువతకు ఉద్యోగ కల్పన లభిస్తుందని ఆమె అన్నారు. ఆమె వెంట తెలుగుదేశం పార్టీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆర్ ఆక్స్ఫర్డ్ లో ఘనంగా హెూలీ వేడుకలు



**కందుకూరు,కలంకౌంటర్ :** పట్టణంలోని స్థానిక పామూరు రోడ్డు లోగల బి.అర్.ఆక్స్ ఫర్డ్ ఒలింపియాడ్ స్కూల్ నందు సోమవారం హెూలీ సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థిని, విద్యార్థులు గులాం, పలు రకాల రంగు నీళ్ళు ఒకరిపై ఒకరు చల్లుకుంటూ సరదాగా, ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ భాస్కరరావు, కరస్పాండెంట్ బి.వెంకటేశ్వర్లు, డైరెక్టర్స్ జి.బాల భాస్కరరావు,బి. నరేంద్రబాబు,తదితర ఉపాధ్యాయ సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

# రామ్ చరణ్ జన్మదిన వేడుకలు






**గుంటూరు,కలంకౌంటర్ :** గుంటూరు చిరంజీవి జిల్లా అధ్యక్షుడు మేకల రవీంద్రబాబు ఆధ్వర్యంలో మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ పుట్టినరోజు సందర్భంగా నాజ్ సెంటర్ శ్రీ ఆంజనేయ స్వామి వారి దేవస్థానం నందు ప్రత్యేక ఆకు పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నగరం జనసేన పార్టీ అధ్యక్షులు & గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త నేరేళ్ల సురేష్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# ప్రకాశం అటానమస్ తొలి ఫలితాలు విడుదల- రామయ్య



**కందుకూరు,కలంకౌంటర్ :** ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ అటానమస్ తొలి ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఫస్ట్ ఇయర్ తొలి సెమిస్టర్ పరీక్షలు ఫిబ్రవరిలో 14 నుండి నెలాఖరు వరకు జరిగాయి. ఇతర కాలేజీ నుండి వచ్చిన ప్రొఫెసర్లు పరీక్ష పత్రాలను మార్చి 3, 4, 5వ తేదీలలో దిద్ది ఫలితాలను సబ్జెక్టుల వారీగా ఇచ్చారు. ఆ ఫలితాలను సమీక్షించి యూనివర్సిటీ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్స్ (C.E) ఎన్.రామక్రిష్ణయ్య కి ప్రకాశం సీ.ఈ డాక్టర్ దస్తగిరి నివేదిక సమర్పించారు. ఆ నివేదికతో పాటు ఆన్ లైన్ కొన్ని సబ్జెక్టుల పరీక్ష పత్రాలను కూడా JNTU C.E రామక్రిష్ణయ్య పరిశీలించి క్లియరెన్స్ ఇచ్చారని ప్రకాశం అటానమస్ చీఫ్ సూపర్ డెంట్ డాక్టర్ సి. హెచ్.రవికుమార్ వెల్లడించారు. అన్ని బ్రాంచీల పై 42.47 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులు కాగా, CSE అత్యధికంగా 50% ఉత్తీర్ణత సాధించారు. యాజమాన్య ప్రతినిధిగా టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ కె కె.విజయ శ్రీనివాస్, అన్ని విభాగాల హెచ్.ఓ.డి లు ఆయా ఫలితాలు సమీక్షించి నేడే విడుదల చేయాలని తీసుకున్న నిర్ణయం మేరకు సోమవారం సాయంత్రం సెక్రటరీ కరస్పాండెంట్ కంచర్ల రామయ్య ఫలితాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.విజయ శ్రీనివాస్ మాట్లాడుతూ అధ్యాపకులు, ఎగ్జామ్స్ సెల్ నిర్వహకులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. చిన్న తప్పిదం కూడా కొండంత అయ్యే ప్రమాదముందన్నారు. కరస్పాండెంట్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ఫస్ట్ సెమిస్టర్ ఎగ్జామ్స్ నిర్విఘ్నంగా విజయవంతంగా పూర్తి చేసిన ఎగ్జామ్స్ సెల్ ను అభినందనలు తెలిపారు.

# ఎన్నికల ప్రచారం ప్రారంభించిన కోన, నందిగం



**బాపట్ల రూరల్,కలంకౌంటర్ :** బాపట్ల మండలం, మూల పాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన బాపట్ల నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కోన రఘుపతి,ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్...

# వాసవి నగర్ లో ఘనంగా హెూలీ వేడుకలు



**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు వాసవి నగర్ లో హెూలీ సందర్భంగా సోమవారం వాసవి నగర్ యూత్ ఆధ్వర్యంలో హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువత రంగులు చల్లుకుంటూ, డాన్సులు చేస్తూ, కేరింతలు కొడుతూ, ఆనందోత్సాహాల మధ్య హెూలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు హెూలీ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దినేష్, విగ్నేష్, దాస్విన్, దీపిక, సైదా, కిరణ్, వాసవి నగర్ యూత్ పాల్గొన్నారు.

# ఉపాస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గుండెజబ్బుల పై అవగాహన సదస్సు

● మంచి జీవనశైలితో గుండె జబ్బులను నిరోధించవచ్చు - డాక్టర్ చివుకుల శ్రీధర్





**కందుకూరు, కలంకౌంటర్ :** ఒంగోలులోని ప్రముఖ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఉపాస్ హాస్పటల్ వారి ఆధ్వర్యంలో కందుకూరు శ్రీ సీతారామ కళ్యాణ మండపం నందు ఆదివారం ప్రముఖ ఇంటర్వెషనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ చివుకుల శ్రీధర్ గుండె జబ్బుల పై అవగాహన సదస్సు నిర్వహించారు. గుండె పని చేసే తీరును, గుండె సంబంధిత వ్యాధులపై సందేహాలను కార్యక్రమానికి విచ్చేసిన వారికి నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మంచి జీవన శైలితో గుండె జబ్బులను నిరోధించవచ్చని అన్నారు. మంచి ఆహారం తీసుకొనుట, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ధూమపానం మద్యపానానికి దూరంగా ఉండటం వలన, శారీరక మానసిక ఒత్తిడి ఎక్కువ గురికాకుండా ఉండటం వల్ల గుండె సంబంధిత వ్యాధులను చాలావరకు నిరోధించవచ్చునని అన్నారు.కుటుంబంలో గుండె సమస్యలు ఉన్నవారు,షుగర్, బీపీలు ఉన్నవారు గుండె సంబంధిత వ్యాధులు త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి వారు ఎల్లప్పుడూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ శ్రీధర్ సూచించారు. ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ డైరెక్టర్, కీ హెూల్ సర్జన్, ఆర్థో డాక్టర్ ప్రకాష్ చవల మాట్లాడుతూ త్వరలో కందుకూరు పట్టణంలో ఉపాస్ కార్డియాలజీ సేవలందిస్తామని తెలిపారు. కందుకూరు వాసులతో తనకు స్నేహబంధం ఉందని అందువల్ల కందుకూరు వాసులకు సేవ చేయటం తనకు ఎంతో సంతోషమని అన్నారు. ఉపాస్ హాస్పిటల్ కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా వాసవి క్లబ్బుల ద్వారా, లైన్స్ క్లబ్బుల ద్వారా, ఆర్యవైశ్య సంఘాల ద్వారా ఎన్నో సేవలు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ తన్నీరు మల్లికార్జున మాట్లాడుతూ ప్రజల ద్వారా మనం సంపాదించిన దాంట్లో కొంత ప్రజాసేవకు వినియోగించడం మన ధర్మం అని అన్నారు. లేకుంటే మన జన్మకు అర్థం ఉండదని అన్నారు. అనంతరం డాక్టర్ శ్రీధర్ ను, డాక్టర్ ప్రకాష్ ను, డాక్టర్ మల్లికార్జునరావును సుకుమార్ గుప్తా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మలినేని గ్రూప్స్ చైర్మన్ మలినేని లక్ష్మయ్య, విపిజి జువెలరీ యజమాని వేముల సుకుమార్ గుప్తా, శ్రీ కోదండ రామాలయం ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీను, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఆర్ వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా వాసవి సేవాదళ్ అధ్యక్షులు చీదెళ్ల వేణుగోపాలరావు, ఆర్యవైశ్య మీడియా చైర్మన్ చక్కా వెంకట కేశవరావు, కోటపాటి నారాయణరావు, మలినేని ఎం బి ఏ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసరావు, ఇస్కాల మధు తదితరులు పాల్గొన్నారు.

# మచిలీపట్నంలో కార్యకర్తలకు ప్రలోభాలు పెట్టి పార్టీ నడుపుతున్న పేర్ని నాని - మాజీమంత్రి కొల్లు రవీంద్ర





**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం 19వ డివిజన్లో పెద్ద ఎత్తున తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ కార్యకర్తలు కార్పొరేటర్ దేవరపల్లి అనిత, కొల్లూరు లలిత రాజు ఆధ్వర్యంలో మాజీ మంత్రి కొల్లు రవీంద్ర సమక్షంలో సుమారు 50 కుటుంబాలు ఏ వైసీపీ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం నిలవాలంటే తెలుగుదేశం జనసేన ఎన్డీఏ ప్రభుత్వం రావాలి. ఎన్ని ప్రలోభాలు పెట్టిన తెలుగు దేశం పార్టీలో చేరేందుకు ముందుకు వచ్చిన మీ అందరికీ అభినందన లు. బందరులో త్వరలో నాటకాల నాని నాటకాలను చూడబోతున్నం.. నాటకాలు ఆడుతూ తింటున్న కంచాన్ని లాక్కుంటూ ఒక ముద్ద పెట్టా లని అర్థిస్తారు. ప్రజలు ఆ నాటకాలను నమ్మవద్దు. కడుపునిండా అన్నం పెట్టే ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం. ప్రజలు ఎన్నికలు ఎప్పుడు వస్తాయో అని ఎదురుచూస్తున్నారు. బడుగు బలహీనవర్గాల పార్టీ తెలు గుదేశం పార్టీ. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైయస్సార్ కాలనీలో ఎప్పుడు నుంచి వేధిస్తున్న కాలువకి ఇరువైపులా గోడ నిర్మించి ప్రొడక్షన్ ఏర్పాటు చేస్తాం. మచిలీపట్నంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రెండు సెంట్లు స్థలాన్ని ఇచ్చి ఇల్లు నిర్మిస్తాం. అర్ధరాత్రి పూట ఫోన్ చేసినా మీ అందరికీ అందుబాటులో ఉంటాను. అక్రమ అరెస్టులకు భ యపడే వ్యక్తిని కాదు. మీకు ఏ సమస్య వచ్చినా పార్టీ నాయకుల దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తాను. సూపర్ సిక్స్ పథకాల ద్వారా చదు వుకున్న ప్రతి పిల్లవానికి 15 వేల రూపాయలు అందిస్తాం. చంద్రన్న బీమా ద్వారా చనిపోయిన ప్రతి కార్మికునికి 10 లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందిస్తాం. మహిళలకి ఉచిత గ్యాస్ ఉచిత బస్సు ప్రయాణా సౌకర్యాన్ని ఉమ్మడి ప్రభుత్వంలో కల్పిస్తాం. బీసీలకు 50 సంవత్సరాలకే పెన్షన్ అందిస్తాం.ఆర్ అర్జున మాట్లాడుతూ. గత ఐదు సంవత్సరాలుగా వైసిపి కోసం పనిచేస్తే మా కాలనీలో కనీస అవసరాలు తీర్చలేదు పేర్ని నాని. ఇంత కాలం మాయ మాటలతో మమ్మల్ని మభ్యపెడుతూ వచ్చారు. ఇంక మీ నాటకాలను నమ్మే పరిస్థితి లేదు. మచిలీపట్నంలో కొల్లు రవీంద్ర విజయానికి కృషి చేస్తాం మచిలీపట్నం అభివృద్ధి పథంలో నడిపించుకుంటాం. వైసిపి పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన వారిలో ఆర్ అర్జున, మరియమ్మ,ఆర్ బ్రహ్మ, మాణిక్యం బాజీ, రాజేంద్ర శివ వంశీ బాబురావు శిరీష కుమార్ మనోహర్ మనీ కాళీ ఏసు భవాని దుర్గ నాగుల్ మేరా గంగ దుర్గ రాని పామర్తి రవి తాడిమహాలక్ష్మి మంజుల తంగీల అయ్యమ్మ గంగ పాంచాలి మరియు 50 కుటుంబాల తెలుగుదేశం పార్టీ కండువా కప్పుకున్నారు.. ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, జనసేన పార్టీ ఇంచార్జ్ బండి రామకృష్ణ, కొనకళ్ళ బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్,మోటమర్రి బాబా ప్రసాద్, ఇలియాస్ షా షా, గడ్డం రాజు,రొండి కృష్ణ,పిప్పళ్ళ కాంతారావు మరకని పరబ్రహ్మం బచ్చుల చంద్ర బోస్, అంజి, భాగ్య రావు తదితర తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జగన్ రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలో చీలిక

● ఎన్నికల ప్రచారంలో యువనేత లోకేష్





**మంగళగిరి,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ ప్రయోజనాల కోసం గత ఎన్నికల్లో కులాలను రెచ్చగొట్టారు. ఈసారి కులం, మతం, ప్రాంతం పేరుతో సమాజాన్ని నిట్టనిలువునా చీల్చే ప్రయ త్నం చేస్తున్నారని టిడిపి యువనేత నారా లోకేష్ తీవ్రస్థాయిలో విరు చుకు పడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లి పైన్ వుడ్ అపార్ట్ మెంట్ నివాసితులతో యు వనేత సమావేశమయ్యారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకునేందుకు నేను అపార్ట్ మెంట్ వాసులతో సమావేశమవుతుంటే పెత్తందార్ల ముద్ర వేస్తున్నారు, అపార్ట్ మెంట్లలో నివసించే వారు పెత్తందారులా అని ప్రశ్నించారు. భారతదేశం మొ త్తమ్మీద జగన్ లాంటి దొంగ, 420 మరొకరు లేరు, ఆయన ఎన్నికల కమిషన్ కు సమర్పించిన అఫిడవిట్ లో కేసుల లిస్టే ఎక్కువగా ఉంది. ఎన్నికల్లో లబ్ధి కోసం సొంత బాబాయిని లేపేసి ఆ నెపాన్ని మాపై నెట్టే ప్రయత్నం చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంగళగిరి ప్రాంతంలో రూ.1800 కోట్లతో ఎయిమ్స్ నిర్మిస్తే కనీసం వాటర్ కనెక్షన్ ఇవ్వలేని దౌర్భాగ్యపు ముఖ్యమంత్రి జగన్. కేంద్ర ప్రాయోజిత పథకాలకు మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వలేక నిధులు మురగబెట్టిన అసమర్థుడు. దేశంలోనే పేరెన్నికగన్న వ్యాక్సిన్ కంపెనీ భారత్ బయోటెక్ కు కూడా కులరంగు పులిమారు. దీంతో ఆ సంస్థ ఒరిస్సా వెళ్లి రూ.1200 కోట్లు పెట్టుబడి పెట్టింది. జె-ట్యాక్స్ విధానాల కారణంగా అనేక పరిశ్రమలు పొరుగు రాష్ట్రాలకు తరలివెళ్లాయి. జగన్ దృష్టంతా అవినీతి సంపాదనపై తప్ప అభివృద్ధి, ఉద్యోగాల కల్పనపై లేదు. జగన్ రూ.12లక్షల కోట్ల అప్పుచేసి బటన్ నొక్కడంతో ఆ భారం ధరల పెంపు, పన్నుల రూపంలో తిరిగి ప్రజలపైనే పడుతోంది. చంద్రబాబు నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయిన వద్ద నుంచే అమరావతి పనులు ప్రారంభిస్తాం. దేశంలోనే మోడల్ సిటీగా అమరావతి నిర్మాణాన్ని పూర్తిచేస్తాం. అమరావతి నిర్మాణం చేపట్టకుండా అయిదేళ్ల సమయాన్ని వృధా చేశామనే విమర్శలు సరికాదు. ప్రపంచంలోనే అతిపెద్ద ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ పూర్తిచేశాం, మాస్టర్ ప్లాన్, డిజైన్లు తయారుచేసి పనులు ప్రారంభించాం. ఒక మంచి ఇల్లు కట్టాలంటేనే కనీసం 3ఏళ్లు పడుతుంది. అలాంటిది రాజధాని నిర్మాణానికి సమయం పట్టదా? అయిదేళ్ల జగన్ పాలనలో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు. విధ్వంసక విధానాల కారణంగా దెబ్బతిన్న ఇన్వెస్టర్ల సెంటిమెంట్ బలపడాలంటే కనీసం పదేళ్లపాటు ప్రజాప్రభుత్వం ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రజలదే. అయిదేళ్ల తర్వాత మళ్లీ ప్రభుత్వం మారితే మాత్రం యథావిధిగా తిప్పలు తప్పవని యువనేత లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలన్నీ భర్తీచేస్తాం. అధునాతన టెక్నాలజీతో నేరాలకు చెక్ పెడతాం. ప్రభుత్వానికి సమాంతరంగా నేను గత అయిదేళ్లుగా మంగళగిరిలో సొంతనిధులతో 29 సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టా. నన్ను గెలిపిస్తే మంగళగిరిని అభివృద్ధిలో పరుగులు తీయిస్తానని యువనేత చెప్పారు.

# బంటుమిల్లి ఉత్సాహంగా ఉల్లాసంగా హెూలీ వేడుక





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి పట్నంలో సోమవారం సాయంత్రం పొట్టి శ్రీరాములు వీధిలో ఆర్యవైశ్య యువత హెూలీ వేడుకను ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకున్నారు చిన్న పెద్ద బేధం లేకుండా కేరింతలు కొడుతూ హెూలీ జరుపుకున్నారు. అలాగే స్థానిక రాజస్థాన్ యువకులు కూడా సోమవారం మధ్యాహ్నం రంగులు ఒకరిపై ఒకరు చిమ్ముకుంటూ ఎంతో ఉత్సాహంగా హెూలీ పండుగలు జరుపుకున్నారు.

# బంటుమిల్లిలో కాగిత డోర్ టు డోర్ ప్రచారం





**బంటుమిల్లి,కలంకౌంటర్ :** పెడన నియోజకవర్గం బంటుమిల్లి మండలం బంటుమిల్లి గ్రామంలో పెడన నియోజకవర్గ తెలుగుదేశం జనసేన బిజెపి పార్టీల ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ సోమవారం మధ్యాహ్నం నుండి రాత్రి ప్రొద్దు పోయేవరకు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. శంకారం సూపర్ సిక్స్ పథకాలను తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ ఇంటింటికి వెళ్లి రానున్న రోజుల్లో చంద్రబాబునాయుడు పవన్ కళ్యాణ్ ,,నరేంద్ర మోడీ, గార్ల నాయకత్వంలో ఈ రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరు కాగిత కృష్ణ ప్రసాద్ కి సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ రాష్ట్రం అభివృద్ధి చెందాలి అంటే ఎన్డీఏ ప్రభుత్వం అధికారం లోకి రావాలని ఆంధ్రప్రదేశ్లో చంద్రబాబునా యుడు ముఖ్యమంత్రి నీ చేసుకోవాల్సిన బాధ్యత మన ఓటర్ల అందరిపై ఉందని పెడన నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు.. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతోతననుగెలిపించాలని కాగిత కృష్ణ ప్రసాద్ కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన సమన్వయకర్త పంచకర్ల సురేష్ బంటుమిల్లి మండల పార్టీ అధ్యక్షులు కోనపరెడ్డి వీరబాబు ,జనసేన పార్టీ అధ్యక్షులు ర్యాలీ సత్యనారాయణ, రవి కిరణ్ , వెంట్రపాటి సురేష్ ,నగమల్లేశ్వరావు,బిజెపి పార్టీ అధ్యక్షులు బండ్రేడ్ ఆంజనేయులు బిజెపి నాయకులు మురారి వెంకటేశ్వరరావు, మైనార్టీ నాయకులు మహమ్మద్ అమీర్, అక్బర్, మహమ్మద్ నూరు, మాజీ పార్టీ అధ్యక్షుడు లీలా కృష్ణ , అంగర రంగనాదు, కంచడం మాజీ సర్పంచ్ సత్యనారాయణ, కూనసాని చిన్న,కట్టా స్వామి, ప్రధాన కార్యదర్శి బుర్ర కాశీ, మహిళా నాయకురాలు దాసరి కరుణాజ్యోతి, జరీనా,నాగేశ్వరమ్మ , రహీం తునిస, కాగిత రంగామని,ఈడే వెంకన్న, సింగంశెట్టి శ్రీ-ను,దాసరి ప్రసాద్ ,భూపతి రమేష్ ,వివిధ హెూదాల్లో గల నాయకులు కార్యకర్తలు జనసేన టిడిపి భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు..





కుప్పంలోని శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన శతరత్న జీర్ణోద్ధారణ ప్రతిష్ట మహా కుంభాభిషేకంలో పాల్గొన్న టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు.

-కుప్పం,కలంకౌంటర్ :

# బుర్రాని కలిసి శుభాకాంక్షలు తెలిపిన నియోజకవర్గంలోని పలు గ్రామాల నాయకులు





**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు నియోజకవర్గం వైఎస్ఆర్సిపి అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల వైయస్సార్సీపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి తమ మద్దతును తెలిపారు. వీరిలో దొండపాడు వైఎస్ఆర్సిపి నాయకు లు, లింగసముద్రం మండలం పెదపవని వైయస్ఆర్ సీపీ నాయకులు, అంగిరేకులపల్లి అల్లం అంజయ్య, ఉలవపాడు మండలం కరేడు గ్రా మం రైతులు, గుడ్లూరు మండలం చిన్న లాటిరిపి గ్రామస్తులు, ఉలవ పాడు మండలం వీరేపల్లి వైఎస్ఆర్సిపి నాయకులు, నూర్ భాషా రాష్ట్ర సంక్షేమ సంఘం నాయకులు, పట్టణంలోని సంధాని భాష ఇంతియాజ్ ముబారక్, సుండి అయ్యవారిపల్లి సర్పంచ్ డేగా వెంకటేశ్వర్లు, ఆవులు మాల్యాద్రి,పట్టణంలోని 16వ వార్డు ముస్లిం నాయకులు తదితరులు బుర్రా మధుసూదన్ యాగమును కలిసి తమ మద్దతును తెలియజేశారు.

# నాదెండ్ల మనోహర్ ను కలిసిన సతీష్



**గుంటూరు,కలంకౌంటర్ :** జనసేన రాష్ట్ర నాయకుడు, తెనాలి కూటమి అసెంబ్లీ అభ్యర్థి నాదెండ్ల మనోహర్ ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన కే. హరి వెంకట సతీష్.

# వైభవంగా శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు

**కందుకూరు,కలంకౌంటర్ :** కందుకూరు పెద్ద బజారునంద ఉన్న శ్రీ కోదండ రామాలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రతి పౌర్ణానికి నిర్వహించే సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు శ్రీరామచంద్ర చార్యుల ఆధ్వర్యంలో పవన్ స్వామి వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ స్వామి మాట్లాడుతూ పౌర్ణమి రోజు శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరిస్తే వారి కుటుంబానికి మంచి జరుగుతుందని అన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొనినా స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించినా స్వామివారి అనుగ్రహం తప్పక కలుగుతుందని అన్నారు. అనంతరం విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రెసిడెంట్ మురారి శెట్టి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి మురారిశెట్టి శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com